
కాలం ఆగింది
మంథా వెంకటరమణారావు
CHANDRA

మనసులో చోటుచేసుకున్న కొన్ని రూపాలను మరిచిపోలేం! కొన్ని సంఘటనల ప్రభావం అలా ఉంటూనే ఉంటుంది!

జీవితంలో మనం చూసిన వ్యక్తులు, వారితో గడపిన క్షణాలు, వారు విడిపోయేక మనసులోంచి పోతున్నాయనుకోడం మనసు చేసే మోసం! వారెక్కడికీ పోరు–మనతోనే ఉంటారు. ఈ మనసు ఎన్నో రూపాలలో వెళ్ళినవారి గురించి ఊహించుకుంటూనే ఉంటుంది.

మనం ఇష్టపడ్డ వ్యక్తులని, మన మనసు గదులలో దాచేసి గడియ పెట్టేస్తాం! తీరిక సమయంలో వారిని గదులలోంచి బయటకు తీసి వారితో సంభాషణలు జరుపుతాం. వారిని ప్రేమిస్తాం, ద్వేషిస్తాం, కసిరిస్తాం, లేదా కాముక చర్యలు జరుపుతాం. ఆ వ్యక్తులు శారీరకంగా పోయినా, వారి రూపం మనసులో ఉండి, వారి కాలగమనాన్ని ఆపుతుంది. పదిహేనేళ్ళ క్రితం చూసిన అమ్మాయి ఇంకా అదే రూపంతో, వయసుతో, చేష్టలతో మనసులో ఉండిపోతుంది.

నేనప్పుడు ఇంటర్ చదువుతున్నాను. మేం అద్దెకుంటున్న ఇల్లు ఆరు వాటాలలో ఒక వాటా! చిన్న వరండా, కొట్టు, మధ్య గది, వంటిల్లు, పెరడు... వర్షాకాలంలో విషాద నాయకిలా ఆ ఇల్లు అదేపనిగా వర్షం కన్నీరు కార్చేది! మా ఇంటి కెదురుగా రోడ్డు–సన్నగా, ఇరుకుగా....

ఆ రోడ్డుకి అవతలవేపున్న ఒక ఇంట్లో ఉండేదామె! ఆ ఇంటికి నేనూ, శివుడూ సాంబడూ, అమరలింగం వెళ్ళి కేరమ్స్ ఆడేవాళ్ళం. సాయంత్రం ఐదుకి వెళ్ళి, రాత్రి ఎనిమిది వరకూ ఆడేవాళ్ళం.

ఆమె పేరు చంద్రిక. తల్లితో కలిసి ఉండేది. చంద్రిక వయస్సు పదహారూ, ఇరవై మధ్య ఎంతయినా అయి ఉండొచ్చు. ఆమె తల్లి వయసు నలభైకీ యాభైకీ మధ్యన ఉండేది.

మేం వెళ్ళగానే, "రండి!, రండి!" అని ఆహ్వానించేది ముసలావిడ ప్రేమగా.... ఆటలో పడేవాళ్ళం.

చంద్రిక చిరునవ్వుతో మమ్మల్ని పలకరించేది కాని మాతో మాట్లాడేదికాదు.

సాయంత్రం ఐదుకి మేం వెళ్ళేసరికి చంద్రిక అందంగా అలంకరించుకొని వీధిలోకి వెళ్ళేది.

చంద్రిక వేషం చిత్రంగా ఉండేది. కొబ్బరినూనె బాగా పట్టించి పక్కపాపిడిగా దువ్విన జుత్తు, జిగజిగా మెరుస్తూ ఉండేది, సాపుగా నల్లగా ఉండేది. ఆ జుత్తుకి పాపిడి పిన్నులు రెండు - సీతాకోక చిలక ఆకారంలో, మధ్యని పొళ్ళతో, ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో, జుత్తుని ఒక కుచ్చులా క్రిందకి వదలి రంగు రంగుల రిబ్బనులు కట్టేది.

ఆమెకి గులాబి రంగు ఎక్కువ ఇష్టం. గులాబీ రంగు చీరలు కట్టేది. ఆ రంగు రిబ్బన్లు జడకి ముడివేసేది. అటువంటి గాజులు వేసుకొనేది.

ముఖానికి స్నో పట్టించి, దానిమీద చెమ్కీల పౌడరు అద్దుకొనేది. దీపం కాంతిలో ముఖం జిగజిగా మెరిసేది. నుదుట చీర రంగుకి మేచింగా బొట్టు పెట్టుకొనేది. చీరలు ఆనాడువచ్చే వలచటి నకిలీ సిల్కువి, పెద్ద పెద్ద పువ్వులు.. రుమాలు మొలదగ్గర దోపుకొనేది.

చంద్రిక పెదవులు ఎప్పుడూ ఎర్రగా ఉండేవి. కాసు రాసిన మిఠాకిళ్ళీ ఎప్పుడూ నములుతూ ఉండేది.

చంద్రిక నా కళ్ళ కెపుడూ గుండ్రగా బంతిలా కనిపించేది. ముఖం గుండ్రం, ఒళ్ళు గుండ్రం.

"నే వెళ్తున్నానే అమ్మా!" అని కేక వేసి, వయ్యారంగా ఒళ్లు తిప్పుకుంటూ నడచుకు వెళ్ళిపోయేది. ఎక్కడికి వెళ్ళేదో తెలిసేది కాదు మాకు. ఏ అర్ధ రాత్రికో తిరిగి వచ్చేది.

ఆమె గురించి గుసగుసలు వినిపించినా పట్టించుకొనే వాళ్ళంకాము. మగాళ్ళెవరూ

ఆ ఇంటికి ఆమె కోసం రావడం మేం చూడ లేదు. అందువల్ల మా సంసారాల మర్యాదకీ, వీధి సభ్యతకీ భంగం వచ్చేది కాదు. జరిగేదేదో ఎక్కడో జరుగుతోంది........ అక్కడ లేదు కదా? అన్న ఉష్ట్రపక్షి మన స్తత్వం మా సంసారాలది!

చంద్రికలో నాకు ఏ మార్పు కనిపించేది కాదు. చెక్కు చెదర కుండా ఉండేది

ఆ వీధిలో, వీధిలోని ఇళ్ళలో కాపురం ఉంటున్న మనుష్యులలోని భాగంగా ఉండేది. చంద్రికతో మాటాడాలని ఉండేది. కాని జంకు! తక్కువ తనం అనుభవించే వారని కాని, ఎందువల్లో కాని చంద్రికని చూస్తే నాలో ఏ సంచలనమూ రేగేది కాదు. ఆమె నాకు పెద్దక్కలా అగుపడేది. ఆమె మగాళ్ళని ఆకర్షించగలుగుతోందని విన్నప్పుడు ఆశ్చర్యం వేసేది! ఈమెలో ఏముంది అనిపించేది.

ఆ రోజుల్లో మిలటరి ప్లాటూ నొకటి వచ్చి ఊరవతల మకాం వేసేరు మా ఊళ్లో. రోజుల తరబడి చంద్రిక కనిపించేది కాదు. ఆమె గురించి ఎన్నో పుకార్లు పుట్టేయి. సిపాయిల నందరినీ గుత్తకి తీసుకుందనే వారు. రెండు చేతులా డబ్బు ఆర్జిస్తోందన్నారు.

చంద్రిక, శశి అన్న మరో అమ్మాయితో కలిసి తిరిగేది. శశి సన్నగా పొడగ్గా ఉండేది కోలముఖం, సోగ కన్నులు, చిన్న నోరు, నాజూకుగా నడిచేది. ఎప్పుడూ కలల ప్రపంచంలో ఉన్నట్టుండేది.

అప్పుడప్పుడు శశి వచ్చేది, చంద్రికని పిలవడానికి. ఇద్దరూ నవ్వుతూ ఏవేవో మాట్లాడుకొనేవారు.

మాకు శలవరోజులపుడు కేరమ్సు ఆడుకుందుకి ఉదయమే ఆ ఇంటికి చేరేవాళ్ళం. పన్నెండు వరకూ ఆడి, భోజనంచేసి మళ్లా కూర్చునే వాళ్ళం. చంద్రిక, శశి అప్పుడప్పుడు తామూ ఆడ్డానికి కూర్చొనేవారు. అప్పుడు నన్ను లేచిపొమ్మనేవారు, నేనంత మంచి ఆటగాడ్ని కాను కాబట్టి! ఆటమీద శ్రద్ధ చూపేవారు కాదు చంద్రిక, శశి— ఓడినా గెలిచినా ఒకటే అన్నట్టు ఆడేవారు. మధ్య మధ్య అందరితో పరాచికా లాడేవారు. కాని నేను దూరంగా ఉన్నట్టే ఉండేవాణ్ణి వాళ్ళతో—ప్రత్యేకంగా మాటలాడేందుకు మాటలుండేవి కావు.


నేను బి.ఏలో చేరేక క్యారమ్సు ఆటలో ఆసక్తి పోయింది. ఇల్లుకూడా మారేం. అందువల్ల చంద్రికనీ, శశినీ చూడటం ఎప్పుడో జరిగేది.

వారిద్దరి గురించి అందరూ చెడ్డగా అనుకోటం వినేవాడ్ని. ఎప్పుడన్నా వాళ్ళు అగుపడ్డప్పుడు వాళ్ళని నిలవేసి, "మీగురించి అందరూ అనుకుంటున్నది నిజమేనా?" అని అడగాలనిపించేది. "నిజంకాదు! పచ్చి అబద్ధం!" అని వారంటారని నా నమ్మకం! అలా వారనేసేక నా మనసు తేలిక పడును కాని అడగలేక పోయేవాడిని-చంద్రికని చూడడం పడ్డప్పుడు ఆమెలో ఏ మార్పు అగుపడేది కాదు! శరీరం ఎప్పటిలానే ఆరోగ్యంగా అగుపడేది.

ఐతే ఈ మిస్టరీ అట్టేకాలం నిలవలేదు.

నా వయసూ పెరిగింది - మనసూ పెరిగింది - మానవ స్వభావం అర్థమవుతూ వచ్చింది. నేను నా మిత్ర బృందంలో తిరిగే వేళల్లో చంద్రికా, శశీ వీధిలో ఎదురు పడేవారు. నన్ను గుర్తుపట్టేవారు కారు- గుర్తు పట్టినా తెలీనట్టే ఊరుకొనే వారు. నా మిత్రులేవో మాటలనేవారు వారి గురించి తక్కువగా, హేళనగా! నాకెంతో కష్టమనిపించినా, వారి తరఫున వకాల్తా పుచ్చుకుందుకి ధైర్యం లేక ఊరుకొనే వాడిని!

చంద్రిక, శశి, కాస్త చీకటి పడుతున్న వేళకి వారి ఇళ్ళనించి బయల్దేరేవారు. మెల్లిగా నడుచుకుంటూ, సందులూ గొందులూదాటి మెయిన్‌రోడ్డు ఎక్కేవారు. మనుష్యులని గమనిస్తూ నడిచేవారు. సినిమాహాల్సు దగ్గర తచ్చాడేవారు. తమ అవసరమున్న మనుష్యులు లేక పోతే




బెంచీ టిక్కెట్టు కొనుక్కొని సినిమాకి పోయేవారు.

నేనూ నా స్నేహితులూ మొత్తం ఐదుమందిమి రాత్రి భోజనాలయ్యేక చక్కర్లు కొట్టేవాళ్ళం. అప్పటికి నేను బి.ఏ పాసయి ఒక చిన్న ఉద్యోగం సంపాదించడం జరిగింది. నా మిత్రబృందం మారిపోయింది. అందరూ నాకన్న పెద్ద సంసార సాగరంలో తేలుతున్న వాళ్ళు.

మేం ప్రపంచంలో ఎన్నో సంగతుల గురించి చర్చించేవాళ్ళం. సినిమాలగురించీ, సాహిత్యం గురించీ, రాజకీయాలగురించీ, మా ధోరణులు చిత్రంగా ఉండేవి - మా భావి గురించి ఎన్నో కలలు కనేవాళ్ళం.

మా అడ్రసు కేరాఫ్ మెయిన్‌రోడ్. అలా నడుస్తూ వెళ్ళి వెళ్ళి సినిమాహాలు పక్కనున్న నాయర్ హోటల్ చేరుకునే సరికి రాత్రి తొమ్మిదయ్యేది. అక్కడ రాత్రి పదకొండు వరకూ గడిపే వాళ్ళం.

నాయర్ హోటలు 'పక్కా'ది కాదు. సినిమాహాలు ముందటి గోడమీంచి గడ్డి చూరు దించి, అక్కడ పారే మురికి కాలవ మీద బల్ల చెక్కలువేసి, నాలుగు అడుగుల వెడల్పు, ఇరవై అడుగుల పొడవూ కలది. కర్ర బెంచీలు, ఊగే కర్ర టేబిళ్ళు.

నాయర్ అప్పటికప్పుడు ఇడ్లీలు చేసి ఇచ్చేవాడు. అవి తిని టీ తాగడానికి ఒక గంట పట్టేది. హోటల్‌కు చేరుకున్న అరగంట వరకూ మేం ఏమీ ఆర్డర్ ఇచ్చేవాళ్ళం కాము నాయర్ అడిగేవాడు కాదు! మా కబుర్లలో పడి కాలాన్నే మరచి పోయే వాళ్ళం. ఆర్డర్ ఇచ్చేక అరగంటకి కాని మాకు కావల్సినవి దొరికేవి కావు.

పది గంటలకల్లా మొదటి ఆట సినిమా వదిలేసేవారు. సినిమాహాలు మీద నున్న లౌడ్ స్పీకర్ లోంచి పాటలు ప్రారంభమయేవి సినిమా వదిలినందుకు సూచనగా.

అప్పుడు చంద్రీ, శశీ మొదటి ఆట సినిమా నించి బయటపడేవారు. హోటల్ ముందు ఆగేవారు. విద్యుద్దీపం కాంతిలో ప్రాముఖ్యంగా కనిపిద్దామని, వెలుగులో నిలబడేవారు బతుకులు చీకటైనా

సాయంత్రం ముఖానికి రాసుకున్న పౌడరు హాలులో గడిచిన మూడుగంటల కాలంలో పట్టిన చెమటకి చెరిగిపోయేవి. ముఖాలు అలుక్కుపోయిన పాత ఫోటోల్లా ఉండేది.

వాళ్ళని చూడగానే నాయర్ అడిగే వాడు తెలుగులో... "ఏం శశీ! చంద్రీ! టీ ఏనా? ఏమన్నా తింటారా?"

"టీనే! మరేమీవద్దు!" అనేది చంద్రిక.

చంద్రిక నన్ను పోలిక పట్టడం ఏనాడో మానేసింది! నేను వయసులోనే కాక, చదువులోనూ పెద్దవాడినయి, ఉద్యోగస్తుడి నయ్యాక 'బాబు'ల స్థాయికి చేరుకున్న వాడి నయ్యాననీ, నన్ను పోలిక పట్టడం అమర్యాదనీ, నా పెద్దమనిషి తనానికి భంగం కలిగిస్తుందనీ చంద్రికకి తెలుసు. అలనాడు వాళ్ళ ఇంట కేరమ్స్ ఆడేటప్పుడు ఆమె మాటకోసం, చూపుకోసం, దర్శనంకోసం మనసు ఎంత ఉవ్విళ్ళూరేదో, ఆమెతో ఎంత కలుపుగోలుగా మాట్లాడాలని కోరుకొనే వాడినో, ఆ సంగతి నేను ఏనాడో మరచిపోయేను! చంద్రిక ఎదురైతే అందరిముందు ఎక్కడ పలకరించేస్తుందో నన్న భయంతో ముఖం తిప్పుకునేవాడిని ఆదిలో. కాని ఆ అవసరం లేక పోయింది. నన్ను చూడనట్టే ప్రవర్తించేది!

నాయర్ హోటల్లో వారి గ్లాసులు వేరేగా ఉండేవి. వాళ్ళకి మాకిచ్చే గ్లాసులలో టీ ఇచ్చేవాడు కాదు.... వాళ్ళకి ఏవన్నా రోగాలుంటే అవి గ్లాసులకి అంటుకుంటాయని నాయరు భయం! ఎందరో వందలమంది రోజూ తాగే గ్లాసులలో మాకు టీ ఇస్తాడు ఈ వందలమందికీ రోగాలు ఉండవా? పాపం! చంద్రికా, శశీ వంటి ఆడవాళ్లుతాగే గ్లాసులకే రోగాలు అంటుకుంటాయా?

నాయర్ అందించిన టీని చంద్రికా, శశీ తాపీగా తాగేవాళ్ళు. వాళ్ళని అప్పుడు పరిశీలనగా చూసేవాడిని. వారిలో నాకేమీ ఆకర్షణ అగుపడేది కాదు.

మగాళ్ళని ఆకర్షిద్దామని వాళ్ళు చేసే ప్రయత్నం గమనించి జాలివేసేది.

టీ తాగుతున్నారే కాని, వాళ్లు అందరినీ గమనించేవారు.

ఆ సమయానికి ఆ ఇద్దరూ నాయర్ టీ దుకాణం ముందుంటారని అందరికీ తెలుసు! లారీ డ్రయివర్లు, బస్సు డ్రయివర్లు, క్లీనర్లు వారివెంట పడేవాళ్ళు! సినిమాహాలు చుట్టుపక్కల ఉన్న సందుల్లో రాత్రికి లారీలని ఉంచేవారు, తిండి తిని నాటు సారా తాగి ఆడదానికోసం వేటలో పడేవారు.


కొందరయితే చంద్రినీ, శశినీ ముందు నించీ సినిమా టిక్కెట్‌తో సహా బుక్ చేసుకొనే వారు. వారికి సినిమాకీ, టీకి డబ్బులు ముందే ఇచ్చేవారు. కొందరు మొదటి ఆట సినిమా అవగానే వీరిని తీసుకపోతే, కొందరు రెండో ఆట సినిమా అయ్యాక పోయేవారు.

మా స్నేహితులలో మాష్టారు నాకన్న ఇరవై ఏళ్లు పెద్ద. ఆయన్ని ఓసారి అడిగేను

"మాష్టారూ! నా చిన్ననాటి నించీ చంద్రిని చూస్తూ వచ్చేను, అప్పుడెలా నాకు కనిపించేదో ఇపుడూ అలానే కనిపిస్తోంది. వీళ్ళకి ముసలి తనం లేదా?"

మాష్టారు లంక పొగాకు చుట్ట ముట్టించి చిరునవ్వునవ్వి, జవాబిచ్చేవారు "వాళ్ళలో మీకు ఏ మార్పు ఎందుకు కనిపించటం లేదంటే వాళ్ళ నెపుడూ కొనే దృష్టితో మీరు చూడలేదు కనక! అమ్మనీ, చెల్లినీ, అక్కనీ మనం రోజూ ఇంట్లో చూస్తూ ఉంటాం. వాళ్ళలో ఏ మార్పూ మనకి కనిపించదుకదా? చిన్ననాడు మన కళ్ళకి ఎలా అగుపడేవారో ఇప్పుడూ అలాగే కనిపిస్తారు! అది మీ మనస్సుమీద ఆధారపడి ఉంది!"

నాకు ఆ ఊరినించి బదిలీ అయిపోయింది-మరో ఊరు వెళ్ళి పోయేను-పెళ్ళి చేసుకున్నాను—పిల్లల్ని కన్నాను-అందరూ పడ్డట్టే సంసార సాగరంలో పడ్డాను-ఎన్ని




కబుర్లు చెప్పినా ఎంత మహనీయుడైనా చేసేది అంతే-రోజు తిండి తినడం, సంగమించటం, పిల్లల్నికని పెంచడం, ముసలాడవటం, చావడం-రాజకీయాలు, సుఖాలు, కష్టాలు, ఇవన్నీ ఈ కార్యక్రమం కోసమే ఉన్నాయి-

ఐదేళ్లు గడిచి పోయేయి-

ఆ ఊరు ఆఫీస్ పనిమీద వెళ్ళడం పడింది. వెళ్ళేను కాని, మునుపటి సంతోషం లేదు ఆ ఊరుని చూడగానే-ఎందుకంటే ఏ ఊరైనా సన్నిహితత్వం ఆ ఊరిలోని మిత్రులని బట్టి ఉంటుంది-నా స్నేహితులంతా చెట్టుకొకరూ, పుట్టకొకరూ వెళ్ళిపోయేరు-మాష్టారు కేన్సర్ వచ్చి చచ్చిపోయేరు-ఇంకెవరున్నారు కనక?

పాత స్థలాలూ, పాత జ్ఞాపకాలూ మాత్రం మనసులో పదిలంగా ఉండిపోతాయి! అందు వల్ల ఆ రాత్రి తొమ్మిది గంటలకి నాయర్ హోటల్‌కి టీ తాగే మిషలో వెళ్లేను, అక్కడ కూర్చొని నా మిత్రులతో గడపిన మధుర క్షణాలు గుర్తు చేసుకుందామని!

ఇడ్లీ చెప్పేను-అంత వరకూ టీ చప్పరిస్తూ కూర్చున్నాను-

మొదటి ఆట సినిమా వదిలేరు.

నా కళ్లు చంద్రిక కోసం వెతికేయి!

టీ తాగడానికి ఇద్దరు స్త్రీలు వచ్చేరు... కాని....వాళ్ళు చంద్రికా, శశీకారు! కొత్త వాళ్ళు!

నాయర్ వాళ్ళని అడిగేడు......."టీ తాగుతారా? ఇడ్లీ కూడానా?"

ఇద్దరిలో సన్నటి మనిషి అంది...."టీ ఇయ్యి! చాలు'"

వారి గురించి వేరేగా ఉంచిన గ్లాసులలో టీ పోసి ఇచ్చేడు నాయరు.

నేను నాయర్‌ని అడిగేను, సిగ్గు విడిచి పెట్టి ..."ఏం నాయర్! ఇక్కడికి చంద్రిక

అన్న అమ్మాయి వచ్చేది ఇదివరకు! ఇప్పుడు రావటం లేదా?

నాయర్ నాకేసి ఆశ్చర్యంగా చూసేడు "అదెప్పటి సంగతి తమరు చెప్తున్నారు బాబూ? చంద్రి చచ్చిపోయింది! దాని ఒళ్లు పాడయింది. ఎవరూ చూసే దిక్కు-లేక, ఒక పూరిపాకలో ఊరవతల దిక్కు-మాలిన చావు చచ్చింది! చందాలు పోగుచేసి శవాన్ని కాల్చేం!"

నా మనస్సుకు అనకోని అఘాతం తగిలింది!

చంద్రిక చచ్చిపోయిందా? దిక్కు-మాలిన దానిగా చచ్చిపోయిందా!? రోగాలతో బాధపడి బాధపడి మరణించిందా?!

నా మనస్సుని అంతులేని విచారం ఆవహించింది! ఎవరో అతి దగ్గరి, సన్నిహిత బంధువు, ఆప్తురాలు మరణించినట్టు అనిపించింది. కళ్ళంట నీళ్ళు వచ్చేయి! ఎందు కింతగా అనుభూతి? చంద్రికకూ నాకూ ఉన్న బాంధవ్యమేమిటి? సంబంధమేమిటి?

ఆలోచిస్తే ఎన్నో కారణాలు కనిపిస్తాయి-.

చంద్రిక నాకు చిరపరిచితురాలైన వ్యక్తి! నా చిన్నతనంతో ముడిపడి ఉన్న రూపం! చిన్ననాటి రోజులంటే ఆ వ్యక్తులంటే ఎవరికి ప్రేమ ఉండదుకనక?

చంద్రిక ఎన్నో చిత్రమైన అనుభూతులను రేపేది నా ఎదలో? జాలి, విచారం, తోటి మానవుడిమీద ఓర్పు, పై వారి కష్టాలకి సానుభూతి, బతుకంటే సహనం, బాధలంటే ఓర్పు, శాంతం, ఇవన్నీ మనిషి కుండాలని చంద్రిక నాకు చెప్పకుండానే చెప్పింది! తన బతుకుతో ఒక ఉదాహరణ చూపింది!

డబ్బుకే అయినా, మగాడిలో ఆనందాన్ని కలిగించాలన్న ఆమె తపన, ఎందరో విభిన్న మనస్తత్వంగల పురుషులు రోజూ ఎదురయ్యే ఆమె జీవితంలో ఛీత్కారాలనీ, అవమానాలనీ, హింసనీ, మూర్ఖత్వాన్ని, కరుకుదనాన్నీ ఆ వ్యక్తులనుంచి స్వీకరిస్తూ, వారిపట్ల సహనం వహించి, వారికి సంతోషం కలిగించిచూడడం, మనసు రక్తం కారుస్తున్నా పైకి నవ్వుతూనే ఉండడం ఆమె ప్రత్యేకత!

నాకు జీవితంలో ఎన్నో సార్లు చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్య చేసుకోవాలని బుద్ధి పుట్టేది-డబ్బు, హోదా, కీర్తి ఇవి లేని జీవితం వ్యర్థం అనిపించేది

అటువంటి క్షణాలలో చంద్రిక నా మనసులోని ఎన్నో గదులలోని ఒక గదిలోంచి తలుపు తీసుకు వచ్చేది—నా ఎదురుగా చిరునవ్వుతో నిలిచేది—ఆమె ఏ హోదా ఆశించింది? ఆమె రోజూ ఒళ్ళు వెలకి పెట్టి సంపాదించే ఐదూ పదీ రూకలతో ఏ మేడలు కట్టింది? ఏ కవులు వాటిని గానంచేసేరు? ఆమె ఎందువల్ల ఆత్మహత్య చేసుకు చచ్చిపోలేదు?

"తమ్ముడూ! బతుకు బతకడానికే ఉంది! బతుకు నూరేళ్లు!" అంటాయామె కళ్లు ఆప్యాయతతో నాకేసి చూస్తూ!

చంద్రిక ఎప్పుడూ నా మట్టుకి చచ్చిపోలేదు! ముసలి దవలేదు! ఆమె మట్టుకు నా మనసులో కాలం ఆగింది!